క్లుప్తంగా

జైన రమేశ్‌కు గౌరవ డాక్టరేట్



జనగామ: స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో అనేక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా పట్టణానికి చెందిన జైన రమేశ్‌కు గుడ్ న్యూస్, డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్సిటీ–న్యూయార్క్ టెక్సాస్ అనుబంధ సంస్థ గాడ్ సన్ హోలీ థియలాజికల్ యూనివర్సిటీ సంస్థ శనివారం ఎడ్యుకేషన్, సోషల్ సర్వీస్ కేటగిరిలో గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఆరోగ్య శిబిరాలు, ఆధ్యాత్మిక కార్యాక్రమాలు, ప్రభుత్వ బడుల్లోని పేద విద్యార్థులకు సహకారం, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ బాధ్యతలను స్వీకరించి సమాజం మెచ్చుకునే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు.

విరాళం



చిల్పూరు: చిల్పూరుగుట్ట దేవస్థానం కింది భాగంలోని అంగడి స్థలంలో భక్తుల కోసం నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు నిర్మాణం కోసం దాత రూ. 80 వేలు ఈఓ లక్ష్మీప్రసన్నకు శనివారం అందజేశారు. హైదరాబాదుకు చెందిన మేకల వంశీసునీల్‌రెడ్డి–మాధవీలతలు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఈఓ, ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావులకు విరాళం ఇచ్చారు. జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, ధర్మకర్తలు వేముల వెంకటేశ్వర్లు, గోలి రాజశేఖర్‌గుప్త ఉన్నారు.

పరామర్శ



పల్లాను పరామర్శిస్తున్న పొన్నాల లక్ష్మయ్య

జనగామ/బచ్చన్నపేట/నర్మెట: ప్రమాదవశాత్తు జారిపడి చికిత్స పొంది హైదరాబాద్‌లోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య శనివారం పరామర్శించారు. త్వరగా కోలుకుని నియోజకవర్గ ప్రజలకు సేవలు చేయాలని ఆకాంక్షించారు. ఆయనవెంట జనగామ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, సీనియర్ నాయకులు నర్సయ్య, గురువయ్యగౌడ్, ఎండీ మాజీద్, రఘు, ఠాకూర్, సొడ మహేష్, మధుసూదన్ ఉన్నారు. అలాగే నర్మెట, బచ్చన్నపేట మండలాలకు చెందిన నాయకులు ఇర్రి రమణారెడ్డి, బోడిగం చంద్రారెడ్డి, పులిగిల్ల పూర్ణచందర్, మాలోత్ శ్రీనివాస్, జాల శేఖ కిషన్, పిట్టల రాజు, కుంటి కమలాకర్ తదితరులు పల్లాను పరామర్శించారు.

నిత్యావసరాల అందజేత

పాలకుర్తి: వావిలాల గ్రామానికి చెందిన జీపీ కార్మికుడు అనపర్తి యాకయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, శనివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, కోశాధికారి బర్రె కుమారస్వామి, ట్రస్టు ప్రతినిధులు పిట్టల శ్రీనివాస్, గోనె అనిల్ పాల్గొన్నారు.

షూ, పలకల పంపిణీ

దేవరుప్పుల: మండలంలోని నీర్మాల ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జనగామకు చెందిన దాత మాశెట్టి శాలిని, సంతోష్‌కుమార్ దంపతులు షూ పంపిణీ చేశారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో దాతల కుమారుడు మాశెట్టి శ్రీయాన్ జన్మదిన వేడుకలు నిర్వహించి స్వీట్లు పంచి పెట్టారు. అలాగే వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాసరలోని జ్ఞానసరస్వతి అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయించిన పలకలను పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిరణ్‌కుమార్ ,పాఠశాల ఏఏపీసీ చైర్మన్ చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు నల్ల నిర్మల, లక్ష్మి , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంతాపం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ఎస్సీ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు సింగపురం బాలరాజు శుక్రవారం మృతిచెందాడు. కాగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సింగపురం ఇమ్మానియేల్‌రాజ్ శనివారం బాలరాజు మృతదేహంపై పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని శవపేటికను మోశారు. మాజీ ఎంపీటీసీ సింగపురం దయాకర్, పార్టీ నాయకులు వడ్లూరి మౌనిక, సింగపురం నాగయ్య, రడపాక రాజ్‌కుమార్, సింగపురం నాగయ్య, కోరుకొప్పుల మహేందర తదితరులు ఉన్నారు.

నియామకం

పాలకుర్తి టౌన్: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వల్మిడి గ్రామానికి చెందిన వీరమళ్ల బాబురావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య శనివారం నియామక పత్రాన్ని బాబురావుకు అందజేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

ఇలా ఉంటే వెళ్లేదెలా?





ఐదేళ్ల క్రితం కంకర పోసిన రాళ్లబాయితండా రోడ్డు, జనవరిలో కంకరపోసిన రత్నతండా రోడ్డు

- ప్రమాదకరంగా రహదారులు
- రోడ్డు సౌకర్యం లేక గిరిజనుల తంటాలు

నర్మెట: మండలంలోని పలు తండాలకు సరైన రోడ్డు సౌకర్యాలు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చిత్తడే చిత్తడే.. వాహనాలు కదలవు.. నడక నరక యాతన.. విషపురుగులు కాటేసినా, ప్రమాదాలు సంభవించినా, ఆస్పత్రులకు వెళ్లాలన్నా.. పండించిన పంటలను మార్కెట్‌కు తరలించాలన్నా, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాన్నా.. 108 వాహనం రావడానికి ఏమాత్రం వీలు లేకపోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతం. ఆగాపేట నుంచి రత్నతండా, హన్మంతాపూర్ నుంచి రాళ్లబాయి తండా, కన్నెబోయిన గూడెం నుంచి ధరావత్ తండా, మల్కాపేట నుంచి లుంబియాతండా, శివ బీక్యతండా, నర్మెట–జనగామ హై వే నుంచి తాళ్లతండా, నర్మెట–మచ్చుపహాడ్ ప్రధాన రహదారి నుంచి ఇప్పలగడ్డలకు బీటీ రోడ్లు వేసి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పలు దారుల్లో కంకర వేసి వదిలి వేయడంతో రోడ్లు మరింత ప్రమాదంగా మారాయి. ఈ రోడ్లన్నీ మూడు కిలోమీర్ల లోపువే కావడం గమనార్హం.

చీకటి పడిందంటే భయమే..



చికటి పడందటే భయమే.. రాత్రిళ్లు బస్సు దిగిరావాలన్నా, మహిళలు ఒంటరిగా రావాలన్నా ఇబ్బందే. ఎంతోమంది అధికారులకు, నాయకులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న వారులేరు. ఐదేళ్ల క్రితం కంకర వేసి వదిలేశారు.

కిష్టయ్య, సోషల్ సర్వీస్, రాళ్లబాయితండా

పోరాటాలు చేస్తున్నాం..



పదేళ్లుగా పోరాటాలు చేస్తున్నాం. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిఈజీలకు విన్నవించుకున్నాం. గత ప్రభుత్వంలో ఇచ్చిన మాటను తప్పడంతో ఎమ్మెల్యేను సైతం రోడ్లపై అడ్డుకున్నాం. మాపై కేసులు పెట్టారు. ఇప్పటికైనా గిరిజనుల బాధలను అర్థం చేసుకుని రోడ్లు వేయించాలి.

ధరావత్ రాజు నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు

గిరిజనులంటే చిన్నచూపు..



గిరిజనులంటే చిన్నచూపు. అధికారులు పట్టించుకోరూ. నాయకులు ఎన్నికల సమయంలో వచ్చి పెద్ద పెద్ద మాటలు చెప్పి వెళ్తారు. గెలిచాక ఈ వైపుకు కూడా తొంగి చూడరు. గట్టిగా అడిగితే ఏ పార్టీ అంటరు. సార్లూ ఇకనైనా మా బాధను అర్థం చేసుకోండి.

ధరావత్ పంతులు , రైతు, రత్నతండా

ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ కోతలు

- రైతులు, వినియోగదారుల ఇబ్బందులు



ఖిలాషాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్

రఘునాథపల్లి: రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ కోతలతో వినియోగదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌స్టేషన్ అధికారుల నిర్లక్ష్యంతో సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సబ్‌స్టేషన్ నుంచి ఖిలాషాపూర్ టౌన్ ఫీల్డర్, అగ్రికల్చరల్ ఫీల్డర్, మాధారం, ఇబ్రహీంపూర్, కుసుంబాయితండా, కొత్తగూడెం ఫీడర్లలోని ఆయా గ్రామాల గృహాలకు 1124 కనెక్షన్లు, వ్యవసాయ బోర్లకు 1803 కనెక్షన్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఖిలాషాపూర్‌లో సబ్‌స్టేషన్ ఉన్నా గ్రామంలో కూడా విద్యుత్ కష్టాలు తప్పడం లేదు. శుక్రవారం సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయడంతో చీకట్లో ఉండాల్సి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రకటనలు చేస్తున్నా.. ఆచరణలో అమలు కావడం లేదు. వ్యవసాయ బావులు, బోర్లకు ప్రస్తుతం తెల్లవారు జామున 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మాత్రమే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కొనసాగుతుంది. అందులో బ్రేక్ డౌన్‌లు, ఎల్‌సీల కారణంగా గంటల తరబడి సరఫరా నిలిపి వేస్తున్నారని రోజులో 12 గంటలు కూడా సరిగా రావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఫీడర్లకు నిరంతరం విద్యుత్‌ను అందించే వారని, గ్రామాల్లో సమస్య వస్తే తప్పా సరఫరా నిలిపి వేసేవారు కాదని వాపోతున్నారు. గాలి వీచినా, వర్షం వచ్చినా వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నారన్నారు. నాట్లకు పొలాలు సిద్ధం చేయాలని,.విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ సమస్యపై విద్యుత్ ఏఈ రవీందర్‌ను వివరణ కోరగా అప్పుడప్పుడు బ్రేక్ డౌన్ల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, సమస్యలను బట్టి మాత్రమే ఎల్‌సీలు ఇస్తున్నామన్నారు. సబ్‌స్టేషన్‌కు విద్యుత్ ఎలా వస్తుందో అలాగే సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు.

రాయితీపై పప్పు దినుసు విత్తనాలు

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



రైతులకు రాయితీపై పప్పు దినుసు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: పప్పు దినుసుల సాగును చేసేందుకు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు 100 శాతం రాతీపై విత్తనాలను అందిస్తుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. జాతీయ ఆహార భద్రత పథకం కార్యక్రమంలో భాగంగా శనివారం రైతు వేదికలో రైతులకు 100 రాయితీపై పప్పు దినుసు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితానికి ఆర్గానిక్ వ్యవసాయ సాగు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి డి.రామారావు, ఏడీఏ అజ్మీరా పరుశరాంనాయక్, మార్కెట్ చైర్‌పర్సన్ లావుడ్యా మంజుల, వైస్ చైర్మన్ అనుమలు మల్లారెడ్డి, వ్యవసాయ అధికారి శరత్ చంద్ర, ఏఈఓలు రాధిక, ముత్తినినేని వెంకటేష్, దీపక్,కీర్తి, సువర్ణ, కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, పోగు శ్రీనివాస్, చిలువేరు సంపత్, భాస్కర్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్థికసాయం



జనగామ రూరల్: స్థానిక జిల్లా ప్రజా పరిషత్ బాలికల పాఠశాలకు ప్రవాస భారతీయురాలు కల్వ సునీత ఇంగ్లిష్ టీచర్ హిమబిందు ద్వారా 1,100 డాలర్ల ఆర్థికసాయం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జి.శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు దాతలు విరాళాలు అందజేయడం ద్వారా పేద విద్యార్థులకు ఎంతో సాయం చేసిన వారు అవుతారన్నారు. ఈ సందర్భంగా ఆర్థికసాయం చేసిన సునీతకు అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ధ్యాన శిక్షణ



మాట్లాడుతున్న కట్ట కళాధర్‌రెడ్డి

జనగామ రూరల్: పట్టణంలో మణిద్వీప పిరమిడ్ ధ్యాన మందిర 7వ వార్షికోత్సవ సంబరాల్లో భాగంగా శనివారం మార్కండేయ స్వామివారి కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు వంగాల రాజేందర్ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హిమాలయ యోగి కట్ట కళాధర్‌రెడ్డి పాల్గొని ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. కిషన్ రెడ్డి, ఆనంద్ తాలియా, శ్రీదేవి, యాకూబ్, వీరస్వామి జనార్దన్, సత్యనారాయణ, మాధవి, యశోద, వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, కర్ణాకర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

బచ్చన్నపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు సూచించాలన్నారు. ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంత ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో మండల వైద్యాధికారి సృజన, తహసీల్దార్ ఫణి కిషోర్, ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూసీ చామంతి, పీఆర్‌ఏఈ సాయి రంజిత్, ఏపీఓ కృష్ణ, ఎపీఎం నాగేశ్వరావు, పంచాయతీ కార్యదర్శులు ,టెక్నికల్ అసిస్టెంట్స్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రాములు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాయలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైద్యాధికారి అనిల్, ఎంపీఓ రవీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంతి, ఏపీఓ మంజుల, ఏపీఎం పిట్టల నరేందర్, సీసీలు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు పాటుపడాలి



విద్యార్థులతో యూత్ కాంగ్రెస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీపాషా అన్నారు. మండలంలోని నమిలిగొండ శివారులోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో యూత్‌కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం సే నో టు డ్రగ్స్ సిగ్నేచర్ క్యాంపెన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో డ్రగ్స్‌కు అలవాటు పడమని సంతకాలు చేయించడంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జానీపాషా మాట్లాడుతూ విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు గురికావద్దని, మాదవ ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని, మంచి అలవాట్లతో పాటు క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు నీల మహేష్, సృజన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జలాభిషేకం

రఘునాథపల్లి: మండలంలోని శ్రీమన్నారాయణపురంలో వరుణుడు కరుణించాలని శనివారం గ్రామస్తులు గ్రామ దేవతలకు నీటితో జలాభిషేకం చేశారు. ఇంటింటి నుంచి మహిళలు నీళ్ల బిందెలతో డోలు వాయిద్యాల నడుమ పాటలు పాడుతూ గ్రామ దేవతల వద్దకు వెళ్లారు. నీటితో జలాభిషేకం చేసి, కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. అనంతరం మహిళలు సుట్టుకాముడు ఆడారు.

చర్య తీసుకోవాలి



జనగామ రూరల్: అనుమతులు లేని ప్రైవేట్ స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి యాసారపు కరుణాకర్ కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా రవాణా శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులు అందజేస్తున్న వైద్యులు

చిల్పూరు: వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ ఉడ్డెమారి రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం హైదరాబాద్‌లోని మాల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారు ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జీపీ కార్యదర్శి అజీజ్‌పాషా, డాక్టర్లు వంశీకృష్ణ, ప్రతిభ, లక్ష్మి, ముభశీర బస్సు, అనికెట్, ప్రణవ్, సమీర, లక్ష్మీప్రియ, రాంబాబు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి


పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసంగ్రామ స్థాయిలో కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి, కొడకండ్ల మండలాల ఎంపీటీసీ క్లస్టర్ కోర్డినేటర్లు, గ్రామ కోఆర్డినేటర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. ఎంపీటీసీ క్లస్టర్ కోర్డినేటర్లు, గ్రామ కోఆర్డినేటర్లు, గ్రామస్థాయి కన్వీనర్లు, సోషల్ మీడియాతో పాటు అనుబంధ సంఘాల పనితీరులను సమావేశంలో చర్చించారు. మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, గోపాల్‌రెడ్డి, శ్యాంసుదర్‌రెడ్డి, ఎర్రబెల్లి రాఘవరావు, రవీందర్‌రావు, వీరమానేని యాకాంతరావు,బీసుల లలిత, బండిపెల్లి మణెమ్మ, గద్దం యాకసోమయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

‘స్థానికం’లో గెలుపునకు కృషి చేయాలి

పాలకుర్తి టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విదానాలపై ప్రజలకు వివరించాలన్నారు. పాలకుర్తి నియోజవర్గ అభివృద్ధి చేసిన ఘనతా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు దక్కిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కమ్మగాని నాగన్న, బండి కిరణ్, కర్ణాకర్‌రెడ్డి, ఎడవెల్లి కృష్ణ, వీరమానేని సోమేశ్వర్ రావు, తిమ్మరావు, హనుమంతరావు, సలేంద్ర సోమన్న పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- పండ్ల వ్యాపారి ఆవేదన



మాట్లాడుతున్న బాధితులు రజిత దంపతులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక బస్టాండ్ స్థలంలో ఎలాంటి టెండర్లు లేకుండా ఉచితంగా పండ్ల దుకాణాలు నిర్వహిస్తున్న వారి షాపులను ఆర్టీసీ అధికారులు తొలగించి అధికారికంగా టెండర్ ద్వారా షాపు ఏర్పాటు చేసుకున్న తమకు న్యాయం చేయాలని పండ్ల వ్యాపారులు మైల రజిత, సంపత్ దంపతులు కోరుతున్నారు. బాధితులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్‌లో పండ్ల దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు ఆర్టీసీ అధికారులు నిర్వహించిన టెండర్ ద్వారా నెలకు రూ.16,500 చొప్పున టెండర్ దక్కించుకున్నట్లు తెలిపారు. ఐదేళ్ల అగ్రిమెంట్‌తో టెండర్ పొందామని, మొదట అప్పు తెచ్చి రూ.1.45లక్షలు డిపాజిట్ చేశామన్నారు. నెలనెలా అద్దె చెల్లిస్తున్నామని, మా షాపు ఎదురుగా ఇతరులు యథేచ్ఛగా దుకాణాలు పెట్టడంతో వ్యాపారంలో తీవ్ర నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి వారి షాపులను తొలగించి తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన చెందుతున్నారు.

ఆదమరిస్తే అంతే

- ప్రధాన రహదారిపై గొయ్యి



రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

నర్మెట: మండలకేంద్రం నుంచి రఘునాథ్‌పల్లికి వెళ్లే ప్రధాన రహదారి (డబుల్ లేన్ ఆర్ అండ బీ రోడ్డు)లో ఇసుకబాయితండా వద్ద రోడ్డుపై పెద్ద గొయ్యి పడి ప్రమాదకరంగా ఉంది. కాగా, దీనిపై తండావాసులు హెచ్చరికగా చెట్ల కొమ్మలు ఏర్పాటు చేయడంతో పగటిపూట ప్రమాదాలు కొంత వరకు నివారించవచ్చు. చీకట్లో వెళ్లే వాహనదారులకు ముఖ్యంగా ద్విచక్రవాహనాలకు పెను ప్రమాదం పొంచి ఉన్నదని అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని తండా వాసులు కోరుతున్నారు.

తెలియకుండా వచ్చే వారికి ప్రాణాంతకమే..



వారం రోజుల క్రితం చిన్నగా రంధ్రం పడింది. అది క్రమేణా పెద్దగా అవుతుంది. స్థానికులుం జాగ్రత్తగా వెళ్తున్నాం. తెలిని వారు వేగంగా చీకట్లో వాహనాలపై వస్తే ప్రాణాలకే ప్రమాదం. అధికారులు తక్షణం స్పందించాలి.

- బానోత్ రాజు నాయక్ , రైతు ఇసుకబాయితండా

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి




శిక్షణలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

జఫర్‌గఢ్: మహిళలు పొదుపు సంఘాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఏ రవీందర్ అన్నారు. స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పడిన మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీసీ మేర్గు నర్సింగం, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, సోమయ్య జ్యోతి, రాధిక సీఆర్‌పీఎస్ నాగలక్ష్మి, సంతోష, గ్రామ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.

6,7,8 తరగతుల్లో ఆరు ఖాళీలు

కొడకండ్ల: 2025–26 విద్యా సంవత్సరానికి గాను మండలకేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల, కళాశాలలో మూడు తరగతుల్లో ఆరు సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ తెలిపారు. ఆరో తరగతిలో ఎస్సీ–1, బీసీ–1, 7వ తరగతిలో బీసీ–1, ఎస్టీ -1, 8వ తరగతిలో జనరల్–1, ఎస్టీలకు–1 సీటు ఖాళీగా ఉన్నాయని, బ్యాక్‌లాగ్ ఖాళీలు భర్తీ చేయుటకు జూలై 2వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన జూలై 1 సాయంత్రం 5 గంటలలోపు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డుకు మరమ్మతు



మరమ్మతు చేసిన రోడ్డు

జనగామ రూరల్: జనగామ నుంచి హుస్నాబాద్ వెళ్లే రహదారి గానుగుపహాడ్ వంతెన వద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారడంతో డీసీపీ ఆదేశాల మేరకు శనివారం పోలీసులు మట్టిపోసి తాత్కాలిక మరమ్మతు చేపట్టారు. గతంలో కూడా ప్రమాదాలు జరగడంతో అధికారులు మరమ్మతులు చేపట్టి వదిలేయగా భారీ వర్షాలతో రోడ్డు కోట్టుకపోయింది. తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లకు విద్యుత్ కట్

- సమయమివ్వాలని కోరినా వినిపించుకోని అధికారులు

నర్మెట: మండలంలోని వెల్దండలో గత రెండేళ్ల క్రితం నిర్మాణాలు పూర్తిచేసుకున్న 50 డబుల్ బెడ్రూం ఇళ్లను ఇటీవలే అధికారులు లబ్ధిదారులకు కెటాయించారు. కాగా విద్యుత్ బిల్లులు రూ. 1,745 రావడంతో బిల్లు అధికంగా వచ్చిందని లబ్ధిదారులు చెల్లించలేదు. దీంతో బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని అదికారులు తెలుపగా, సమయం కావాలని వినియోగదారులు కోరినా వినిపించుకోకుండా బుధవారం సాయంత్రం సరఫరా నిలిపివేశారు. అనంతరం కొందరు వినియోగదారులు బిల్లులు చెల్లించగా మరికొందరు సమయం కావాలని కోరినట్లు సమాచారం. దీంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.